696) శంకరాభరణం

ప॥ ఎవ్వరు గాననివాడు యశోద గనె నట్టె। పవ్వళించెబ్రహ్మతండ్రి బాలుడయ్యె నట్టె॥

చ॥ ఘనయోగీంద్రులమతి గట్టువడినట్టివాడు। పనిలేక రోల గట్టుపడివాడట్టె।
తనియ సురలకు పాదము చూపినట్టివాడు। మొనసి బండిమీద మోపినాడట్టె॥

చ॥ అమృతము చేత దచ్చి అందరికిచ్చినవాడు। తమితో వెన్న దొంగిలె దానె యట్టె।
గుమురై దేవదానవకోటికి జిక్కనివాడు। భ్రమసి గోపికలపాల జిక్కినా డట్టె॥

చ॥ యిందు గల డందులేడనెంచి చూపరానివాడు। అందమై రేపల్లె వాడ నాడీనట్టె।
అంది కృష్ణావతారమయినట్టిదేవుడే। యిందున శ్రీవేంకటాద్రి యెక్కి నిలిచె నట్టె॥